క్లుప్తంగా

నేడు కల్తీ మద్యంపై నిరసన ప్రదర్శన

తెనాలి: నకిలీ మద్యం, అనధికార మద్యం బెల్టుషాపులను అరికట్టాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనలో భాగంగా తెనాలిలో సోమవారం నిరసన ప్రదర్శన జరగనుంది. పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో ఉదయం 10 గంటలకు స్థానిక శివాజీచౌక్ నుండి ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వరకు ఈ ప్రదర్శన జరుగుతుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పార్టీ స్థానిక కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో కోరారు.

అన్నదానం



తెనాలిఅర్బన్: పట్టణంలోని నిరాశ్రయుల ఆశ్రమంలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొప్పుల విజయమాధవి, బొల్లిముంత కృష్ణ, సత్యనారాయణ, మల్లెల సత్యవతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల చెట్లు తొలగింపు



కొల్లిపర: మండల పరిధిలోని కృష్ణానది కరకట్ట ఇరువైపులా ముళ్ల కంప పెరగటం వలన నిత్యం పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న దృష్ట్యా ఆదివారం ఎస్ఐ పి.కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి ముళ్లకంపలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డుకి ఇరువైపులా విపరీతంగా ముళ్ల కంప పెరగటం వలన వాహనదారులకు రాత్రి సమయంలో సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పొక్లెయిన్‌తో ముళ్లకంప తొలగిస్తున్నామని తెలిపారు. వాహనచోదకులు కరకట్టపై వేగంగా వెళ్లకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణాన్ని సాగించాలని కోరారు.

వాహనాల తనిఖీ



తెనాలిరూరల్: తెనాలి త్రీ టౌన్ ఎస్ఐ కరిముల్లా ఆదివారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇక్కడి పాత బస్టాండ్ ఓవర్‌బ్రిడ్జి మలుపు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న వారిని వాహనాలను నడుపుతున్న మైనర్లను, సరైన పత్రాలు లేని వారిని గుర్తించి వారికి జరిమానా విధించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

మహిళలపై దాడి: కేసు నమోదు

తెనాలిరూరల్: స్వల్ప విషయమై మహిళలపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన గోపి తన ఎదురింటిలో నివసించే బాలుడితో స్వల్ప విషయమై ఘర్షణ పడి కొట్టాడు. మధ్యలో అడ్డుకునేందుకు వెళ్లిన బాలుడి తల్లి, నాయనమ్మలపై సైతం దాడి చేసి గాయపర్చాడు. బాలుడి నాయనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ విజయ్‌కుమార్ శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్

పట్నంబజారు: ఈ నెల 20వ తేదీన దీపావళిని పురస్కరించుకుని, బాణసంచా విక్రయించే వ్యాపారులు పూర్తి స్థాయిలో అన్ని అనుమతులు తీసుకోవటంతో పాటు, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్ కోరారు. లాలాపేటలోని ఆయన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. లైసెన్స్‌లు, సరైన అనుమతులు లేకుండా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. షాపులు, గొడౌన్‌లు ప్రజలు నివశించే ప్రాంతాలకు దూరంగా ఉండాలని తెలిపారు. తప్పని సరిగా ఫైర్ సేఫ్టీ చర్యలు పాటించాలని, మైనర్లను పనిలో పెట్టుకోకూడదని, అధికారులు సూచించిన సమయాల్లోనే విక్రయాలు చేపట్టాలని సూచించారు. దీపావళి రోజు సాయంత్రం 5 గంటల తరువాత అమ్మకాలు పూర్తి నిషేధమని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వలు ఉంచితే.. వాటిని సీజ్ చేయటంతో పాటు చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ నిల్వలు కలిగి ఉన్న వారి సమాచారాన్ని డయల్ 112, 8688831568 కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

పండగలకూ పప్పన్నం లేదు !

- రేషన్ లబ్ధిదారులకు అందని కందిపప్పు
- కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిలిచిన పంపిణీ
- ఈనెల, వచ్చే నెల అంటూ వాయిదాలు
- దసరా, దీపావళి పండగల సమయంలో కూడా పంపిణీ చేయని వైనం



కొల్లిపర మండలంలో ఓ డిపోలో రేషన్ పంపిణీ



గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందించిన కందిపప్పు →

కొల్లిపర: రాష్ట్రంలో 15 నెలల కూటమిలో పాలనలో ప్రజలు విసిగిపోయారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు చూసి తమ బతుకులు మారతాయమని భ్రమించి, ఓటేసి తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. కూటమి పాలనలో సామాన్యుడి బతుకు కష్టంగా మారుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి నెల సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ప్రతీ ఇంటింటికి ఏదో ఒక రూపేణా ఆర్థికంగా లబ్ధి కనిపించేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నగదు బదిలీ, సంక్షేమ పథకాలు పూర్తిగా అటకెక్కాయి. అదేవిధంగా ఎప్పటినుంచో అమలులో ఉన్న నిత్యావసర సరుకుల పంపిణీ విధానం దాదాపుగా కనుమరుగవుతున్నట్లు కనిపిస్తోంది.

మండలంలో 18,441 రేషన్ కార్డులు...

కొల్లిపర మండలంలో 20 గ్రామాలకు గాను 18,441 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరికి రేషన్ 46 డిపోల ద్వారా సరుకులు అందిస్తున్నారు. ప్రతి నెల మండలంలో లబ్ధిదారులకు 228.502 మెట్రిక్ టన్నుల బియ్యం, 10 క్వింటాల పంచదార, 20 క్వింటాల కందిపప్పు అవసం ఉంటుంది. గత 15 నెలలుగా కందిపప్పు రేషన్ షాపుల్లోకి రావటంలేదు. రేషన్ డిపోల్లో గతంలో కందిపప్పును కిలో రూ.68 చొప్పున ఇచ్చేవారు. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర ప్రస్తుతం రూ.140 నుంచి రూ.180 పలుకుతోంది. పేద, మధ్యతరగతి ప్రజలు ఇంతధర వెచ్చింది కొనలేని, తినలేని పరిస్థితి కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేషన్ దుకాణాల ద్వారా నేటివరకు కందిపప్పు అందించలేదు. డీలర్లను ప్రజలు ఈ విషయమై నిలదీస్తుంటే వారు ఈ నెల, వచ్చే నెల అంటూ కాలం నెట్టుకొస్తున్నారు.

గతంలో ఇంటి వద్దకే..

వైఎస్సార్ సీపీ ఐదు సంవత్సరాల పరిపాలనలో రేషన్ లబ్ధిదారులకు ఇంటివద్దే బియ్యం, పంచదార, కందిపప్పు అందేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రేషన్ సరుకుల్లో కందిపప్పుకు కోత వేసింది. పంచదారను కూడా పూర్తిస్థాయిలో అందించకుండా అరకొరగా ఇస్తోంది. పంచదార ధర బయట మార్కెట్‌కు రేషన్ షాపుల వద్ద పెద్దగా తేడా ఉండడం లేదు. కందిపప్పు ధర మాత్రం బయటి మార్కెట్‌లో కొండెక్కి కూర్చుంది. పోనీ రేషన్ డిపోల ద్వారా అయినా తీసుకుందామంటే ఇక్కడ అసలు పంపిణీనే లేదు. దీంతో సామాన్యుడికి పప్పన్నం అందని ద్రాక్షగా మారింది. ప్రస్తుతం దసరా, దీపావళి పండుగల సమయాల్లో కంది పప్పు అవసరం కాస్తంత ఎక్కువగా ఉంటుంది. అయితే పెరిగిన ధరలు, ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు అందించకపోవడంతో ప్రజలు పండుగ పూట పప్పన్నానికి సైతం నోచుకోలేని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వం సరఫరా చేయడం లేదు

కందిపప్పు సివిల్ సప్లయి గోదాములకు ప్రభుత్వం సరఫరా చేయటం లేదు.అందుకే రేషన్ డిపోలకు రావడంలేదు. ప్రభుత్వం నుంచి గోదాములకు వస్తే అన్ని రేషన్ డిపోలకు సరఫరా చేసి, రేషన్ లబ్ధిదారులకు అందిస్తాం.

– కె.తులసి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల కార్పొరేషన్ అధికారి

బియ్యం మాత్రమే ఇస్తున్నారు..

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారు. పంచదార అప్పుడప్పుడు మాత్రమే అదీ గట్టిగా అడిగితే ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇంటికి వచ్చి మరీ బియ్యం, పంచదార, కందిపప్పు ఇచ్చేవారు. ఇప్పుడు ఒక్క నెల కూడా కందిపప్పు ఇవ్వలేదు. భవిష్యత్‌లో ఈ బియ్యం కూడా ఇస్తారో.. ఆపేస్తారో తెలియడం లేదు.

– ఇ.ధనలక్ష్మి, తూములూరు

రేషన్ దుకాణాల్లో కందిపప్పు ఇవ్వాలి

బయట నిత్యవసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. రేషన్ డిపోల ద్వారా బియ్యం మాత్రమే కాకుండా గతంలో మాదిరిగా కందిపప్పు, వంటనూనె, రాగిపిండి వంటివి రాయితీపై అందించాలి. నెలనెలా కందిపప్పు ఇప్పించే ఏర్పాటు చేయాలి.

– డి.రేణుక, దావులూరు

ట్రంప్ సుంకాల యుద్ధంపై ప్రభుత్వ మౌనం బాధాకరం

సదస్సులో సీపీఎం నేత కేజీ ప్రసాద్



తెనాలి: 'భారతదేశంపై ట్రంప్ సుంకాల యుద్ధం–ప్రభావం–పరిశీలన–ప్రత్యామ్నాయం' అనే అంశంపై స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. సీపీఎం నాయకుడు పి.జోనేష్ అధ్యక్షత వహించారు. సీపీఎం తెనాలి పట్టణ కమిటీ కార్యదర్శి కేబీ ప్రసాద్ సదస్సును ప్రారంభించారు. గత ఆరునెలలుగా ట్రంప్ ఏకపక్షంగా దూకుడుగా వ్యవహరిస్తున్నా, దేశ సార్వభౌమత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసినప్పటికీ భారత ప్రభుత్వం నిరసన తెలియజేయలేదన్నారు. దీంతో ట్రంప్ మరిన్ని రెచ్చగొట్టే చర్యలకు పూనుకుంటున్నారని విమర్శించారు. ట్రంప్ విధానాలతో మన వ్యవసాయం దెబ్బతినేలా ఉందన్నారు. పాడిపరిశ్రమ, టెక్స్‌టైల్, తోలు, ఆభరణాలు, ఆక్వా, మందుల పరిశ్రమలు కోలుకోలేని విధంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంతటి తీవ్ర సమస్యపై దేశంలోని రాజకీయ పార్టీలు స్పందించకపోవటం బాధాకరమని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో సీపీఎం చొరవ తీసుకుని సదస్సు నిర్వహించామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. న్యాయవాది వై.స్టాలిన్, పోస్టల్ యూనియన్ నాయకులు ఉమామహేశ్వరరావు, జి.వెంకటసుబ్బయ్య, షేక్ హుస్సేన్‌వలి, కె.రవికుమార్, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

కవులతో ప్రజల్లో చైతన్యం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

మంగళగిరి టౌన్: సమాజంలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో కవులు ముందుంటారని, వారి పాత్ర ముఖ్యమైనదని తెలుగు, సినీ, బుల్లితెర రచయిత మౌనశ్రీ మల్లిక్ అన్నారు. మంగళగిరి పరిధిలోని రాయల్ బాంక్వెట్‌లో ఆదివారం గోలి మధు రచించిన రెండు కవితా సంపుటిల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిక్ మాట్లాడుతూ గోలి మధు కవిత్వంలో ఫైర్ ఉంటుందని పేర్కొన్నారు. మధు రచించిన ఎదురీత పుస్తకాన్ని ఆంధ్రనాటక కళాసమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సాహితీ విమర్శకులు రాజా హుస్సేన్ మాట్లాడుతూ గోలి మధు కవిత్వంలో స్పష్టత సూటిగా కనిపిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, మినీ కవితల రచయిత రావి రంగారావు, వీటీజేఎం అండ్ ఐఈటీఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దామర్ల వెంకట నరసింహారావు, పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు. తొలుత మంగళగిరి సాహితీ వేదిక కళాకారులు ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి.

అమాత్యా.. హామీని నెరవేర్చండి



సంఘీభావం తెలుపుతున్న కార్మిక నాయకులు

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కార్మికులు 313 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ ఈ ప్రాంతాన్ని పర్యటించినపుడు కూటమి అధికారంలోకి వస్తే సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, సాంబశివరావు, కార్మికులు నవనీతమ్మ, సుభాని, ఖాసిం, సువర్ణకుమారి, బాషా, సుబ్బారావు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని వాగ్దానం చేశారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరంలో లబ్ధిదారులను కలసి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో 18 వేల మంది ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఉన్నారని లోకేష్ తెలిపారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా ఆయన ఇచ్చిన హామీని మాత్రం నెరవేర్చలేదని విమర్శించారు. సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్నారని, సొంత ఇంటి స్థలం లేక అద్దెలతో ఆర్థికంగా ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలాన్ని మంజూరు చేసి గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈనెల 13,14,15 తేదీల్లో ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో మంగళగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు పల్లెకృష్ణ, షేక్ పాపా సాహెబ్, కారసాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

ఎన్నికల ముందు కూటమి నాయకులు పేద ప్రజలకు రెండు సెంట్ల స్థలాన్ని ఇస్తామని వాగ్దానం చేశారని, దాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని రామయ్య కాలనీలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల నుంచి అర్జీల స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు వేణు, మల్లీశ్వరి, వేముల దుర్గారావు,లక్ష్మి, గోపి, భాను తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: ఈనెల 17వ తేదీన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థకార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్ద సంఖ్యలో పేదలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మంగళగిరినగర పరిధిలోని ఆంజనేయ కాలనీలో ఆదివారం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు పెట్టించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జవహర్‌లాల్, నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, వై. కమలాకర్, బాలాజీ, శ్రీనివాసరావు, రామారావు, హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించండి

తాడేపల్లి రూరల్: నాలుగు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను అధికారులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల విస్తృత సమావేశాన్ని తోట కృష్ణకుమారి అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ గుడ్లు ఉడకబెట్టినందుకు, జావ కాచినందుకు అదనంగా డబ్బులు ఇస్తామని అక్షయపాత్ర వారు చెప్పారని, ఇప్పటిదాకా కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులుగా దుర్గారావు, అధ్యక్షురాలిగా అరుణ, ప్రధాన కార్యదర్శిగా కృష్ణకుమారి, కోశాధికారిగా సలోమిని, మరో 10 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్మికులు మరియమ్మ, బాలకోటమ్మ, శేషుకుమారి, రత్నకుమారి, ఫ్రాన్సిస్, షాహిన, రాజేశ్వరి, సామ్రాజ్యం, గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతలాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

ప్రత్తిపాడు: మండల పరిధిలోని కొత్తమల్లాయపాలెంలో ఆదివారం సీతలాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. వేకువజాము నుంచే వేద పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా యంత్రపూజ, పీఠన్యాసం, గర్తున్యాసం, రతన్యాసంలను నిర్వహించారు. అనంతరం 9.15 గంటలకు యంత్రబింబ ప్రతిష్ట, కళాన్యాసం, ప్రాణప్రతిష్ట, కుంభాభిషేకం చేశారు. కొల్లిపర పుట్టా స్వామి వెంకట సునీల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తజనుల సమక్షంలో అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమంతో ప్రతిష్టా మహోత్సవాలను ముగించారు.

విత్తన శుద్ధిపై అవగాహన

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో వివిధ పంటలలో విత్తన శుద్ధి ఆవశ్యకతపై అభ్యుదయ రైతు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదివారం వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ కళాశాల, బాపట్ల రావెప్ విద్యార్థినులు మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసేవిధానం చూపిస్తు విత్తన శుద్ధి ఆవశ్యకతను వివరించారు. విత్తన శుద్ధి వలన లేత మొక్క దశలో వచ్చే చీడపీడలను నివారించవచ్చని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఫిరంగిపురం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండల కేంద్రం కోనేరు కట్ట సమీపంలోని కొండపై భాగంలో శ్రీసాయిరాం స్టోన్ క్రషర్స్, గ్రీన్ వారియర్స్ బృంద సభ్యుల సహకారంతో బంతి విత్తనాలను ఆదివారం సాయంత్రం చల్లించారు. ఈ సందర్భంగా కొండవీడు అసిస్టెంట్ బీట్ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత కాపాడటానికి క్రషర్ సిబ్బంది, వారియర్స్ బృంద సభ్యులు చేస్తున్న సేవలు పర్యావరణానికి దోహదపడతాయన్నారు. బంతి విత్తనాలు మొలిచి పచ్చని కొండలుగా మారతాయని ఆకాక్షించారు. గ్రీన్ వారియర్స్ బృంద సభ్యులు కె.శౌరిఫ్రాన్సిస్, జున్నుసాహెబ్ మాట్లాడుతూ దాతల సహకారంతో ఇప్పటికే మర్రి, తుమ్మ, తురాయి, సీతాఫలం, రామాఫలం వంటి మొక్కలు నాటినట్లు తెలిపారు.



ముగిసిన చేతిరాత శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: అక్షరం అందంగా ఉంటే చూసే వారికి రాసే వారికి మనసు ఆనందంగా, ఆహ్లాదంగా ఉంటుందని మానసిక నిపుణులు చెబుతుంటారని అధ్యాపకుడు మున్నంగి సంజీవరెడ్డి తెలిపారు. రెండు రోజులుగా స్తంభాలగరువు పుల్లయ్య హైస్కూల్‌లో నిర్వహిస్తున్న రెండో విడత ఉపాధ్యాయుల చేతి రాత శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. చేతిరాత చక్కగా ఉంటే విద్యార్థులకు పరీక్షల్లో అదనపు మార్కులు రావడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వ్యక్తిగత, ప్రభుత్వ సెలవులు కూడా త్యజించి విద్యార్థుల కోసం విద్యార్థులై అందమైన రాత నేర్చుకోవటానికి జిల్లా, రాష్ట్రం దాటి వచ్చి శిక్షణ పొందటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, అందుకు ఎంతో మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ జాతీయ అవార్డు గ్రహీత ఉపాల రామమోహనరావు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 35 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శిక్షణ ముగిసిన అనంతరం విజేతలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి పాల్గొన్నారు.

మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

గుంటూరు మెడికల్: వయసుతో నిమిత్తం లేకుండా మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని మానసిక వైద్య నిపుణులు కె.ఎల్.తేజస్విని పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ కేఎల్ తేజస్విని మాట్లాడుతూ యువతలో ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లు పెరిగిపోతున్నాయని చెప్పారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం అత్యవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించే విధంగా పెంచాలన్నారు. ప్రతి ఒక్కరూ వయస్సు, ఎత్తును బట్టి శరీర బరువును కలిగి ఉండడం, ఆహార నియమాలు, శారీరక వ్యాయామం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ నేటి సమాజంలో అత్యధిక శాతం మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్ మాట్లాడారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గాజుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆలోచన మారితే అదే నిజమైన మార్పు

- రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటేష్ కుమార్
- విజ్ఞాన్‌లో ముగిసిన వరల్డ్ మెంటల్ హెల్త్ వారోత్సవాలు



రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటేష్ కుమార్‌ను సన్మానిస్తున్న విజ్ఞాన్ ప్రతినిధులు

చేబ్రోలు: జీవితంలో ప్రతి సారి బయటకి మార్పు కనిపించకపోయినా, మన ఆలోచన మారితే అదే నిజమైన మార్పు అని యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పూర్వ డీన్, రిటైర్డ్ ప్రొఫెసర్ జి.వెంకటేష్ కుమార్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ''వరల్డ్ మెంటల్ హెల్త్ డే – 2025'' వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమాన్ని ''హీలింగ్ మైండ్స్'' అనే థీమ్‌తో నిర్వహించారు. వెంకటేష్ కుమార్ మాట్లాడుతూ మానవ మేధ మూడు స్థాయిలలో పనిచేస్తుందని స్పృహ, ఉపస్పృహ, అవచేతన ఈ స్థాయిలను అర్థం చేసుకున్నప్పుడు భావోద్వేగాలను నియంత్రించే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. మార్పులను గుర్తించగల దృష్టి కలిగి ఉండాలని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఘటనలకు కృతజ్ఞత తెలిపే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ఆలోచనల్లో సానుకూలత పెరిగితే మనసుకు ప్రశాంతత లభిస్తుందని వివరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో 90 శాతం విద్యార్థులు సెల్‌ఫోన్‌లలో ఇరుక్కుపోయి సమయాన్ని, ఆరోగ్యాన్ని, ఆలోచనలను వృథా చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అతిగా మొబైల్ వాడటం వలన శరీర ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, కళ్లకు, మెదడుకు భారం పెరుగుతోందని వివరించారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

స.హ.చట్టంపై అవగాహన పెంచుకోవాలి

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు ఎడ్యుకేషన్: సమాచార హక్కు చట్టంపై ప్రజలందరూ అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రభుత్వ అధికారులు తమ బాధ్యతలు తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఫోరం ఫర్ ఆర్‌టీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈమని హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం లాడ్జి సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రజలతో కలసి అరండల్‌పేటల పోలీస్ స్టేషన్ వరకు నడిచారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజలు తమకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టటం కష్టతరమైన నేపథ్యంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని హక్కుగా పొందే అవకాశాన్ని కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 2005 అక్టోబర్ 12న సమాచార హక్కు చట్టాన్ని తెచ్చిందన్నారు. ముందుగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ జేసీకి భారత రాజ్యాంగ ప్రతిని బహూకరించారు. డాక్టర్ మూకిరి సుధ పాడిన చైతన్య గీతాలు ఆకట్టుకున్నాయి.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ

నగరంపాలెం: వయోవృద్ధులు, దివ్యాంగులను ఆదరించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వంద మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 12 రకాల నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది వృద్ధులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అందరూ ఉండి కూడా ఒంటరి జీవితాలు జీవిస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వారికి ప్రతి ఒక్కరూ ఇతోధికంగా సహాయం అందించాలని చెప్పారు. ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పాలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, కార్యదర్శి మాదాల ప్రకాష్ పాల్గొన్నారు.